క్లుప్తంగా

స్వర్ణాలంకరణలో జగన్నాథుడు


పూజలందుకుంటున్న స్వామివారు

రాజాం సిటీ: స్థానిక బాబానగర్‌లోని సత్యసాయి శివం మందిరంలో ఏర్పాటుచేసిన జగన్నాథస్వామి మంగళవారం స్వర్ణాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గత తొమ్మిది రోజులుగా జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.

జై జగన్నాథ


రథాన్ని లాగుతున్న భక్తులు

బొబ్బిలి: పట్టణంలో జగన్నాథస్వామి మారు రథయాత్ర ఘనంగా నిర్వహించారు. కంచర వీధిలోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి విగ్రహాలను రథంపై ఉంచి పట్టణ వీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు యాత్రలో పాల్గొని స్వామివారి రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. జై జగన్నాథ నినాదంతో పట్టణం మార్మోగిపోయింది.

రికార్డుల నిర్వహణ బాగుండాలి


అంగన్‌వాడీ రికార్డులు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ నూకాలమ్మ

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ఆయా కేంద్రాల్లోని రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని బూరాడ సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్. నూకాలమ్మ కార్యకర్తలకు సూచించారు. మండలంలో అంబఖండి అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రానికి అందుతున్న పోషకాహార వివరాలను పరిశీలించారు. పోషకాహారం సక్రమంగా అందుతుందా లేదా అని లబ్ధిదారులను ఆరాతీశారు.

పంచాయతీ నిధుల ఖర్చుపై ఆడిట్


రికార్డులు పరిశీలిస్తున్న ఆడిటర్ ఉమాదేవి

బొబ్బిలి రూరల్: మండలంలోని 30 గ్రామ పంచాయతీలకు వివిధ పద్దుల కింద విడుదలైన నిధుల జమా ఖర్చులపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆడిట్ నిర్వహించారు. ఆడిటర్ కె.ఉమాదేవి నిధుల ఖర్చు, పెండింగ్ బిల్లుల వివరాలను పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సాధారణ, 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

మడ్డువలస సాగునీటి సరఫరా పెంపు

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా సాగునీటి విడుదలను మంగళవారం పెంపుదల చేశారు. ఈ నెల 14 నుంచి 100 క్యూసెక్కుల సాగునీరు కాలువ ద్వారా విడిచిపెడుతున్నామని, ప్రస్తుతం దాన్ని 200 క్యూసెక్కులకు పెంచినట్లు ఏఈ నితిన్ తెలిపారు. ఆయకట్టు రైతుల అవసరాల మేరకు మరిన్ని క్యూసెక్కుల నీటిని విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

సత్యారావు డాక్టర్ కన్నుమూత


డాక్టర్ రెడ్డి సత్యారావు

బొబ్బిలి: దశాబ్దాలుగా బొబ్బిలితో పాటు పరిసర మండలాల ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ప్రముఖ డాక్టర్ రెడ్డి సత్యారావు మంగళవారం రాత్రి కన్నుమూశారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఆస్పత్రిని ఏర్పాటు చేసి పేదలకు వైద్యం అందించేవారు. పేదల డాక్టర్‌గా మన్ననలందుకుంటున్న డాక్టర్ సత్యారావు కొద్ది రోజులుగా అస్వస్థతతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

నోడల్ ఆఫీసర్‌గా సుమబాల

రాజాం: రాజాం మున్సిపాలిటీతో పాటు రాజాం మండలానికి నోడల్ ఆఫీసర్‌గా కేఆర్ ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమబాల నియమితులయ్యారని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మండలంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నోడల్ ఆఫీసర్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు.

అమలు చేస్తారా.. అటకెక్కిస్తారా..?

- అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- భృతి కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది నిరుద్యోగ యువత
- ప్రభుత్వం నుంచి ఇంతవరకు రాని స్పష్టత



బొబ్బిలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే యువతకు లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబుతో పాటు పవన్ కల్యాణ్, లోకేష్ హామీ ఇచ్చారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత వారి మాటలు నమ్మి కూటమికి మద్దతిచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులు గడిచినా ఉద్యోగ ప్రకటనలు కానీ, నిరుద్యోగ భృతిపై విధివిధానాలను ఇంతవరకు ప్రకటించకపోవడంతో నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొంది. గతంలో కూడా టీడీపీ ప్రభుత్వం నిరుద్యోగ భృతిపై హామీ ఇచ్చి అమలు చేయకపోవడంతో ఇప్పుడు కూడా అలానే చేస్తుందేమోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగ ప్రకటనలు, నిరుద్యోగ భృతి కోసం బొబ్బిలి నియోజకవర్గంలో సుమారు 23,492 మందికి పైగా నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు.

యువతను మోసం చేయొద్దు...



నిరుద్యోగ భృతి ఇస్తామని 2014 ఎన్నికల ప్రచారంలోనూ చంద్రబాబు హామీ ఇచ్చి అమలు చేయలేదు. ఆయన ప్రకటించిన మేనిఫెస్టో అమలులో మోసం చేస్తారని యువతకు తెలుసు. ఈసారి చంద్రబాబు ఒక్కరే వచ్చి హామీ ఇస్తే యువత నమ్మేవారు కాదు. కానీ ఈసారి కూటమిగా వచ్చి హామీ ఇవ్వడంతో యువత మళ్లీ బుట్టలో పడ్డారు. ఈ ఐదేళ్లు సూపర్ సిక్స్, ఇతర హామీల అమలులో మెలికలు, మోసాలు కనిపిస్తాయి. యువత చదువుకున్న వారు కనుక ఈ సారి రాజకీయ నాయకుల హామీలపై ఆలోచించి ఓటేయాల్సిన అవసరం ఉంది.

– శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి

స్పష్టత ఇవ్వాలి



నేను బీఎస్సీ పూర్తి చేశాను. చంద్రబాబు కూటమి ఎన్నికల వాగ్దానంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారని చెప్పారు. లేదంటే ప్రతీ నెల రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పాటై నెలరోజులైనా ఇప్పటివరకు దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. సూపర్ సిక్స్ హామీలలో ఒకటైన నిరుద్యోగ భృతిపై వెంటనే స్పష్టత ఇవ్వాలి. దీని కోసం ఎంతో మంది ఎదురుచూస్తున్నారు.

– గణేష్, బాడంగి

హామీలు వెంటనే అమలు చేయాలి



నేను విజనరీ అని చెప్పుకునే చంద్రబాబునాయుడు ముందుగా తాను ఇచ్చిన హామీలను అమలు చేయాలి. నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాల హామీపై స్పష్టమైన ప్రకటన చేయాలి. నేను ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ పూర్తి చేశాను. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నాను. ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చేలోగా నిరుద్యోగులకు భృతి చెల్లిస్తే వారికి ఆర్థికంగా కొంతైనా సాయంగా ఉంటుంది.

– గేదెల చంద్రకళ, రామభద్రపురం

గతంలో చేసినట్టే చేస్తారా?



మాది బొబ్బిలి పట్టణంలోని ఐదో వార్డు. నేను ఎమ్మెస్సీ బీఈడీ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాను. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించారు. అందులో లక్ష ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి హామీ ఒకటి. గతంలో కూడా టీడీపీ ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా యువతను మోసం చేసింది. ఇప్పుడు కూడా కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులైనా దీనిపై స్పష్టత ఇవ్వలేదు. ఈ సారి కూడా గతంలో చేసినట్టే చేస్తారేమోనని అంతా అనుకుంటున్నారు.

– సీరాపు మనోజ్‌కుమార్, బొబ్బిలి

జాబ్ క్యాలెండర్ ప్రకటించరేం?



చంద్రబాబునాయుడు తమ కూటమి పార్టీ నాయకులతో కలిసి ఇచ్చిన హామీల్లో జాబ్ క్యాలెండర్ ఒకటి. ప్రభుత్వం ఏర్పడగానే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామన్న సారథులు దాని ఊసే ఎత్తడం లేదు. ముందు జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తే నిరుద్యోగులు వారి అర్హతలను బట్టి పోటీ పరీక్షలకు సిద్ధపడతారు. ఈ లోగా నిరుద్యోగ భృతి ప్రకటించాలి.

– వి.సతీష్‌బాబు, ఎంఏ, బొబ్బిలి

తోటపల్లి పిల్లకాలువలో పూడికతీత

సాక్షి ఎఫెక్ట్...

తెర్లాం: తోటపల్లి ప్రధాన కుడికాలువ నుంచి ఉన్న పిల్లకాలువల్లో పూడికతీత పనులను సంబంధిత అధికారులు చేపట్టారు. తోటపల్లి పిల్లకాలువల్లో పూడికలతో పాటు, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగిపోయాయి. సాగునీరు విడుదల చేసినా పంటపొలాలకు వెళ్లని పరిస్థితి. దీనిపై ఈ నెల 15న సాక్షిలో 'కాలువలు ఇలా.. సాగునీరు ఎలా..? అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు ప్రాజెక్టు అధికారులు స్పందించారు. ప్రధాన కుడికాలువతో పాటు ఆమిటి వద్ద ఉన్న పిల్లకాలువలో పూడికతీత పనులు ప్రారంభించారు. పనులు పూర్తయితే ఖరీఫ్‌లో పంటలకు సాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదని ఆమిటి, కొరటాం, కొల్లివలస తదితర గ్రామాల రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.


ఆమిటి-కొరటాం మధ్య తోటపల్లి పిల్లకాలువలో పూడికతీత

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


కొత్తవలసలో ర్యాలీ చేస్తున్న కమిషనర్, తదితరులు


రొంపల్లిలో అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

రాజాం: అంటువ్యాధులుతో పాటు వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు సూచించారు. మున్సిపాలిటీ పరిధి కొత్తవలస గ్రామంలో మంగళవారం పర్యటించారు. డయేరియా, డెంగీ, మలేరియా, తదితర వ్యాధుల వ్యాప్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఏఈ భాగ్యలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రామభద్రపురం: డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు దిలీప్‌కుమార్, ఏఎల్‌జీ శిరీష సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆరోగ్య అవగాహన సదస్సులు మంగళవారం నిర్వహించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, కోటి తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే ప్రారంభం

రాజాం: మండలంలోని గురవాం కేజీబీవీలో ఇంటర్మీడియట్ తరగతుల భవన సముదాయం ప్రారంభానికి సిద్ధమౌతోంది. గత ప్రభుత్వం 'నాడు-నేడు'లో భాగంగా సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా రూ.1.60 కోట్ల నిధులతో అదనపు భవనాల నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ భవనాలు ప్రారంభమైతే ఇంటర్మీడియట్ తరగతుల నిర్వహణతో పాటు విద్యార్థినులకు వసతి కల్పించవచ్చు. నియోజకవర్గంలో తొలి కేజీబీవీ ఇంటర్ కళాశాల పక్కా భవన సముదాయం ఇదే. మరో నెల రోజుల్లో ఈ భవనాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్ఎస్ఏ ఏపీ రమణమూర్తి తెలిపారు.


ప్రారంభానికి సిద్ధంగా కేజీబీవీ అదనపు భవనాలు

విద్యార్థులకు వైద్య తనిఖీలు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి మంగళవారం వైద్య తనిఖీలు నిర్వహించారు. రోడ్లపై అమ్మకం చేస్తున్న ఆహార పదార్థాలను తినొద్దని, ప్రతిరోజు స్నానం చేయాలని, ఉతికి ఆరబెట్టిన దుస్తులను ధరించాలని, సమయానికి భోజనం చేయాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్ రమణ, గురుకుల పాఠశాల హెల్త్ అసిస్టెంట్ తాడేల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

పాస్టర్స్ ఫెలోషిప్ కొత్త కార్యవర్గం

రాజాం సిటీ: స్థానిక బెరాకా బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.యేసుపాదం, ఆర్‌ఎం శ్యామ్యూల్, ఉపాధ్యక్షుడిగా ఎం.సువర్ణరాజు, జాయింట్ సెక్రటరీగా జాన్ వసంతకుమార్, కోశాధికారిగా ఆదినారాయణ, సహాయ కార్యదర్శిగా బి.రాంబాబు ఎన్నికయ్యారు. అలాగే గౌరవ అధ్యక్షులుగా ఎస్‌ఏ రాజు, వి.ప్రభుకుమార్, టి.ఆండ్రూస్‌తో పాటు పలువురు సభ్యులతో కొత్త కార్యవర్గం ఏర్పాటైంది.

తాగునీటిని వృథా చేయొద్దు

రేగిడి: గ్రామాల్లో రక్షిత పథకాల ద్వారా పంపిణీ చేస్తున్న తాగునీటిని ప్రజలు వృథా చేయొద్దని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ కోరారు. మండలంలోని ఉనుకూరు, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం తదితర గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. రక్షిత పథకాల ద్వారా సరఫరా అవుతున్న నీటిని పరిశీలించి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. పాడైన పైపులైన్లను సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

పైపులైన్ లీకులు తక్షణమే సరిచేయాలి

రాజాం సిటీ: మున్సిపాలిటీలోని అన్ని వార్డులకు తాగునీరు సరఫరా చేస్తున్న ప్రధాన పైపులైన్‌కు లీకులు లేకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ జె.రామప్పలనాయుడు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక జీఎంఆర్ ఐటీ సమీపంలో ప్రధాన పైపులైన్‌కు ఏర్పడిన లీకులను మంగళవారం పరిశీలించారు. లీకుల ద్వారా నీరు వృథాగా పోతోందని, త్వరితగతిన లీకులను సరిచేసి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు ఏఈ భాగలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఉన్నారు.

సీసీరోడ్డు నిర్మాణం


సంకిలిలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్

రేగిడి: మండలంలో సంకిలి గ్రామంలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. సర్పంచ్ బుడుమూరు పట్టాభి ప్రత్యేక శ్రద్ధతో దళితవాడ, వెలమవీధిలో రూ.15 లక్షలతో సీసీ రోడ్లు, మురుగుకాలువలు నిర్మాణం చేపట్టారు.

యూనిఫాంల అందజేత

రాజాం: పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 5513 మంది విద్యార్థులకు యూనిఫాం అందించినట్లు ఎంఈఓ-2 యాగాటి దుర్గారావు తెలిపారు. మంగళవారం రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద పలు పాఠశాలల హెచ్‌ఎంలకు యూనిఫాంలను అందజేశారు. వాటిని ఆయా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అందించాలని సూచించారు.

గ్రామాల్లో చురుగ్గా పారిశుద్ధ్య పనులు

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఎంపీడీఓ మధుసూదనరావు ఆదేశాల మేరకు పంచాయతీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో కార్యదర్శులు పనులు చేయిస్తున్నారు. వీధి కాలువల్లో పూడికలు తొలగించడం, దోమల నివారణ మందులు స్ప్రే చేయడం, రక్షిత మంచినీటి పథకాల్లో, నేలబావుల్లో క్లోరినేషన్ చేపట్టారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని సర్పంచ్ తెలిపారు.

రామభద్రపురం: మండలంలోని పాతరేగ గ్రామంలో సర్పంచ్ గొట్టాపు పైడిపునాయుడు పర్యవేక్షణలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగునీటి కాలువల్లో పూడికలు తొలగించారు. తాగునీటి పథకం ట్యాంకు, బోరుబావుల పరిసరాలను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు


జీలికవలసలో అంగన్‌వాడీ టీచర్‌తో మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొండకెంగువ పంచాయతీ మధుర గ్రామం జీలికవలసలో ఇటీవల అత్యాచారానికి గురైన పసికందు కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అలాగే అదే గ్రామంలోని మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలో ఎంత మంది పిల్లలు చదువుతున్నారు? మెనూ ప్రకారం పౌష్టికాహారం ఇస్తున్నారా లేదా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని టీచర్ బుచ్చమ్మను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రహదారి అధ్వానంగా ఉండడంతో పిల్లంతా చదువుకునేందుకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జుమ్మవలస పాఠశాలకు నడుచుకుని వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే జాతీయ రహదారిని దాటుకుని వెళ్లేందుకు భయపడుతున్నారని గ్రామస్తులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. తమ గ్రామ రహదారిని బాగుచేయాలని కోరారు. ఎంపీ స్పందిస్తూ.. పిల్లలను కొండకెంగంవ గ్రామ పాఠశాలలో చేర్పించాలని ఎంఈవో తిరుమలప్రసాద్‌ను ఆదేశించారు. రహదారి బాగుచేయడంతో పాటు కొత్త అంగన్‌వాడీ భవన నిర్మాణానికి త్వరలోనే చర్యలు తీసుకుంటానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కరణం భాస్కరరావు, కనిమెరక శంకరరావు, శిరిపురం శ్రీనివాసరావు, కంచుపల్లి కోటి, గొర్లె రామారావు, తాడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో..

బొబ్బిలి: ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మంగళవారం బొబ్బిలిలో పర్యటించిన ఆయన స్థానిక కోటలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంక్షేమ సంఘక నాయకులు కిరణ్‌కుమార్, వీఎస్ శర్మ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు బొబ్బిలికి సంబంధించిన ప్రధాన సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించాలని కోరారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

- ఆర్డీఓ సాయిశ్రీ


కుసుమూరు వద్ద ఇసుకరీచ్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ, తహసీల్దార్ రాజ్యలక్ష్మి

తెర్లాం: మండలంలోని పలు ఇసుక రీచ్‌ల నుంచి ఎటువంటి అనుమతి లేకుండా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకొనేందుకు వెనుకాడవద్దని బొబ్బిలి ఆర్డీఓ సాయిశ్రీ అధికారులను ఆదేశించారు. మండలంలోని కుసుమూరు వేగావతి నది వద్ద ఉన్న ఇసుకరీచ్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ప్రస్తుతం ఇసుకరీచ్‌లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయా, లేదా అని తహసీల్దార్ రాజ్యలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అనుమతి లేకుండా ఇసుక తరలించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మండల అధికారులకు ఆర్డీఓ ఆదేశించారు. రాత్రి వేళల్లో నాటుబళ్లపై ఇసుకను తరలించే వారిపై నిఘా పెట్టాలన్నారు. మండలంలోని కుసుమూరు, నందబలగ ఇసుకరీచ్‌ల్లో ప్రస్తుతం ఇసుక తవ్వకాలు జరగడం లేదని, అక్రమంగా ఇసుక తరలించే వారిపై దృష్టి సారించాలని తెలిపారు. ఇసుకరీచ్‌ల ద్వారా ఇసుక అక్రమంగా తరలిపోకుండా ఉండేందుకు గ్రామస్థాయి అధికారులతో పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ రాజ్యలక్ష్మి, హెచ్‌డీటీ భాస్కరరావు, వీఆర్‌ఓలు ఉన్నారు.

కౌలురైతుల వివరాలు అందించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్

వంగర: గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి కౌలు రైతుల వివరాలు సేకరించాలని తహసీల్దార్ చిరంజీవి పరాగ్ సిబ్బందిని ఆదేశించారు. తన కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌలు గుర్తింపు కార్డుల మంజూరు కోసం గ్రామాల్లో అర్హులైన కౌలు రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ తట్టికోట కన్నబాబు, డీటీ బూరాడ సుందరరావు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు అందరూ సహకరించాలి

- ఎంపీడీఓ రవికుమార్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బొబ్బిలి రూరల్: కుష్టు వ్యాధిపై సరైన అవగాహన లేక ఎంతో మంది ఈ వ్యాధిబారిన పడుతున్నారని, వ్యాధి లక్షణాలను గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాధిని నిర్మూలించవచ్చని ఎంపీడీఓ పి.రవికుమార్ అన్నారు. పిరిడి పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 2 వరకు ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే చేపట్టాలని సూచించారు. ఎవరైనా వ్యాధి లక్షణాలతో బాధపడుతున్నట్లయితే వారిని ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి పూర్తిస్థాయి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే చికిత్స మొదలు పెట్టాలని సూచించారు. వ్యాధి లక్షణాలు, చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి వంశీ, ఈఓపీఆర్డీ భాస్కరరావు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్సీఎం చర్చి వార్షికోత్సవం


దివ్యబలి పూజలో మాట్లాడుతున్న డాక్టర్ పొలిమేర జయరావు

తెర్లాం: మండల కేంద్రంలోని పునీత ఫ్రాన్సిస్ శౌరి దేవాలయ మహోత్సవం, విచారణ ఆవిర్భావ మొదటి వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఎ.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో దివ్యబలి పూజ, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏలూరు పీఠాధిపతులు, విశాఖపట్నం అగ్రపీఠ అపోస్తలిక్ పాలనాధికారి డాక్టర్ పొలిమేర జయరావు ఏసుక్రీస్తు దివ్య సందేశాన్ని వినిపించారు. ప్రతీ ఒక్కరూ దేవునియందు విశ్వాసం ఉంచాలని, లోకరక్షకుడైన యేసుక్రీస్తును స్వంత రక్షకునిగా అంగీకరించాలన్నారు. అనంతరం వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి హాజరైన అతిథులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో విశాఖపట్నం అగ్రపీఠం నుంచి వికార్ జనరల్ రెవ డి.బాలశౌరి, ఛాన్సలర్ రెవ జె.జాన్‌ప్రకాశ్, ప్రొక్రేటర్ రెవ కె.జయరావుతో పాటు పలు ఆర్సీఎం చర్చిల ఫాదర్లు పాల్గొన్నారు.